

# క్రాసెగ్జామినేషన్

అందమైన న్యాయస్థాన భవనం. సౌకర్యంగా వున్నది. వాది, ప్రతివాది బోనుల్లో నిలబడి వున్నారు. ఇద్దరు న్యాయవేత్తలు, నిలబడి హుందాగా చూస్తున్నారు. మధ్య మధ్య కుర్చీల్లో కూచుంటారు. దోషిని ప్రతివాది అని గూడా అంటారు. నిర్దోషి అని ఋజువుచేసుకోవాలి ప్రతివాది.

వాది ఐడియా సత్యం బైటికి తెప్పించాలని. దోషనిరూపణ చేయాలనిగాదు. తాను పెట్టుకొన్న న్యాయవాది యెదుట కేసు వివరాలని వ్రాసి వుంచింది. తన అభిప్రాయమూ చెప్పింది.

‘‘నా వుద్దేశం, శిక్షపడేట్టు చేయాలనీ గాదు న్యాయవేత్తా. లా నా పక్షం పలకదని నాకూ తెలుసు. దోషికీ తెలుసు. లా ను మించిన దైవమున్నాడని నేడైనా దోషికి తెలిసిరావాలి. అజ్ఞానంలోనే వుండి పోవాలని లేదే. సత్యమే దైవము. లా మారచ్చు. సత్యము మారదు’’.

‘‘అవునమ్మా. లా వుపయోగించి, దైవమున్నాడనీ, సత్యము బైటికి వస్తుందనీ, నిరూపించమంటున్నావని అర్ధమైంది’’.

‘‘హింసను అణచటానికి దైవబలమే సాయపడుతుంది’’.

2

ప్రతివాది తనపక్షం వాదించటానికి నడుం కట్టి వచ్చిన న్యాయవాదితో అన్నాడు. ‘‘నేనే వాదించుకోగలనండీ. న్యాయస్థానంలో తేలేది యెవరు యెక్కువ స్వార్ధపరులు అని’’.

‘‘ఫీజు యివ్వాలని భయపడుతున్నట్టున్నావు. అవసరం లేదు. అండర్‌డాగ్‌ని కాపాడి ఒడ్డున బడేయటం నా హాబీ. నీ తత్త్వమూ తెలుసు. రాజు కంటె మొండివాడు బలవంతుడని లోకోక్తి. మొండివాడి ముక్కు కోస్తే

నెత్తురు తాగి తియ్యగా వుందనును. కీర్తి కాంత నా ప్రియురాలు. ఆమెను నేను సంతోషపెట్టాలి. లేకపోతే రాదు. వాది పెట్టుకున్న న్యాయవాది. నిన్ను క్రాసెగ్జామినేషన్ ద్వారా గెలవలేనని అర్ధం కాగానే, లైంగిక వేధింపు అనే నేరం వేపు కేసు తిప్పి తేలిగ్గా నిన్ను భిక్షాధికారిని చేస్తాడు. గొప్ప వెయిట్ లిప్టర్. ముష్టియుద్ధ విశారదుడు. గడిచిన కాలంలో గొప్ప హాస్యగాడలాగే కోల్పోయాడు. నువే నీ పక్షం వాదించుకోవచ్చు, నీకు గుర్తు రాని చోట, చాతగాని చోట నేనందుకుంటాను''. న్యాయవాది వంక నవ్వుతూ చూస్తూ వుండిపోయాడు ప్రతివాది.

3

న్యాయాధీశుడు తన ఆసనంలో స్థిరపడగానే, న్యాయవాది ప్రిలిమనరీ హియరింగ్ అందుకున్నాడు.

''యువరానర్! బోనులో వున్న దోషి సత్యారావు, మసిబూసి మారేడు కాయనటంలో సిద్ధహస్తుడు. తెనాలి రామకృష్ణుడు రాయలుతో అన్నాడు. ''దానిదేముంది మహారాజా నమ్మేవారుంటే దేనినైనా నమ్మించవచ్చు. ''అదేస్టైల్లో, యువరానర్! హాస్యలాడుతూ, హైపర్‌బోల్ వాడుతూ నేటివరకు నెగ్గుకొస్తున్నాడు సత్యారావు. నా క్లయంటూ సహనమ్మకి, సంపాయించి కూడబెట్టుకున్న వోరిమి అంతా ఖర్చు అయిపోయింది. ఈ నాటకానికి తెరదింపాలని లాను శరణుజొచ్చింది. రాక్షసత్త్వము, హింస, అధర్మము న్యాయస్థానంలో వోడిపోతాయని చూపాలని న్యాయస్థానానికి వచ్చింది''.

''బాగున్నది. మొదట నేర నిరూపణ చేయాలి'' అన్నాడు న్యాయాధిపతి. న్యాయస్థానమంతా కలియజూచాడు.

''అదేమంత సమస్య కాదు యువరానర్! సత్యారావుగారు ప్రతివాది తనకు యే కర్మకాండల మీదా, మంత్రాలలోను, ముఖ్యంగా వివాహమనే తంతు మీద బొత్తిగా నమ్మకమూ లేదనీ, ఆసక్తీ లేదని నమ్మబలికి, నమ్మించేను. కాని

కాలం గడుస్తుండగా, మా చెస్ ఫిక్స్ చేయటమేగాక, డౌరీలకి, తతంగానికి మోనెటరీ హెల్పు చేయుట నా క్లయంటు చూచెను. రెండో నేరం యింకా దారుణం. తన సెటిల్డ్ లైఫ్‌కీ, తనవారికీ సంబంధముండదనీ, అలా యెకార్డ్ జరిగిందనీ యిన్‌లాస్ యెంబెరాస్ చేసే ఛాన్సు వుండదనీ తన ఆనర్ మీద ప్రమాణం చేసెను. అదీ బూటకమేనని కాలం నిరూపించింది. గజనీ, ఘోరీ దండయాత్రలలాగా బంధుగులు ఆత్మీయులు ఆల్టర్‌నేట్‌గా యాత్రలని ప్రపంచాన్ని నమ్మిస్తూ వచ్చి ఒంటెలమీద ధనరాసులూ, వస్తు సముదాయమూ తీసికెళ్లేవారు. నా క్లయంట్‌కి సమాజంలోనూ, ఆచార వ్యవహారంలోనూ, లాలోనూ గూడా బలిమి లేదని నిరూపించారు. అట్టి పరిస్థితిని మసిబూసిన మారేడు కాయి'' అంటున్నాడు న్యాయవాది.

సెల్ఫ్ ఎంగేజ్డ్ న్యాయవాది పచార్లు చేస్తూ వింటున్నవాడల్లా గభీమని యాక్షన్‌తో సహా అందుకున్నాడు.

''యెన్నటికీ కాదు యువరానర్. అట్టిది, మానవహక్కుల పరిరక్షణ కిందికి వస్తుంది. నా క్లయంటు బంధువుల నమ్మకాలు వారివి. నమ్మకమున్నవారు వెడ్డింగులూ వెలిగిస్తారు. తతంగాలు జరిపిస్తారు. గాడినబడిపోతే క్షేమమని హెల్పు తీసుకునైనా సరే డౌరీలు పోస్తారు. రాజకీయాలలోనూ, దేశాల మధ్యలేని దోషం నా క్లయంట్ బంధువులకీ ఆత్మీయులకే యెలా వర్తిస్తుందీ? స్క్రిప్ట్సు మీద గౌరవమూ నమ్మకమూ వున్నాయిగదా యువరానర్! రామాయణం పుక్కిటి పురాణమనీ, అది ప్రమాణ గ్రంథంగా అంగీకరించరాదనీ పోరాడుతూ న్యాయస్థానం వరకూ వెళ్లారు. స్క్రిప్టు తగలబెట్టారు. కసిబోనమ్మ మసిబూసుకున్నట్టు లేదా ఆపని యువరానర్! న్యాయస్థానంలో రామాయణమే గెలిచింది. యెవరినమ్మకాలు వారివీ. వాక్స్వాతంత్ర్యము, మత స్వాతంత్ర్యము, వ్యక్తిగత స్వేచ్ఛా అనేవి గొప్పవని అట్టివాటిని కాపాడుకోవాలని చెపుతూ మదాం బ్లావస్కీ చాటింది. అనుయాయులు ఆ ఆశయాలు వ్యాపింపజేస్తూ ''దివ్యజ్ఞాన సమాజమని'' నడుపుతున్నారు. జీవకారుణ్య సంఘం వారు లా ప్రకారమే

జీవహింస జరక్కుండా భద్రతలు తీసుకుంటున్నారు యువరానర్'' వాడివైపు వకాలత్ పుచ్చుకున్న న్యాయవాదిని చూస్తూ అన్నాడు దిలాసాగా.

''క్రాసెగ్జామిన్''

తల పంకిస్తూ న్యాయవాది అందుకున్నాడు ''నాది ద్రోహబుద్ధి గాదు. ఆడవారిని మోసగించి సొమ్ము చేసుకోవాలని నాకు లేదు. మానవత చూపాలని నా ఆశయం'' అనే తేనెలొలుకు పలుకులు పలుకుతూ ప్రెగ్నెంట్ అయిన స్త్రీని ''అది ప్రెగ్నెన్సీ'' కాదని నమ్మబలకటంలో వంచనగా యేమున్నది? విధికి తల ఒగ్గి కాలం నెట్టుతుండగా మరొక స్త్రీని వంచించాలని చూడటంలో మనఃప్రవృత్తి యెట్టిది? హేల వినబడకుండా, నేర్పుగా తీయగా నవ్వుతూ, ''దాని నందించలేదా, అపుడులేని దోషం యిపుడు కనబడుతున్నదా నాకోసం తపిస్తున్నామెను నేను దేవతగా చూస్తాను. జాబ్ చేసుకుంటూ, ఐవేజు వాడుకుంటూ తన కుటుంబ సభ్యులను ఆదుకుంటుంది. హానియేదీ?'' అని కించపరిచే స్వభావాన్నేమంటారు? ఆ మనిషిని దోషి అనరా?'' ప్రతివాది, న్యాయవాది కవకాశమివ్వకుండా, తలెత్తే తన వాదన అందుకున్నాడు. '' ఒక స్త్రీని సపోర్ట్ చేయటంలో పెద్ద యిబ్బంది వుండదనీ, ఒక ఫామిలీకి ఆసరాగా నిలుద్దామనీ, యువరానర్, యిరువాదుల యిన్‌లాస్, తతంగం తరవాత ఎక్స్‌పెక్ట్ చేసేదదేగా, కాదనగలరా యువరానర్! అనుకుంటే ఫామిలీ మెంబర్సంతా గుమిగూడా సోమరులై నా చేత అన్ని పనులు చేయిస్తూ, ఖర్చులు తగిలిస్తూ నా మీద స్వారీ చేయాలని చూడటం దోషం కాకపోతే, వారు దోషులు కాకపోతే నేనూ దోషినిగాను. యెట్లా అయినానూ?''

''అది అర్థమై, అట్లా అర్థం తీసి కచ్చుపట్టి, శాస్తి చేయాలని రెండవ స్త్రీని, మాయల ఫకీరు బాలనాగమ్మను కుక్కగా మార్చి తనవెంట తీసికెళ్లాలని ప్లాను వేయటం దోషం కాదా? అంతేగాక బాదరబందీ, రెస్పాన్సిబిలిటీ లేని పద్ధతి కనిబెట్టి, ''నీ వాళ్లు కాపాడుతారు. నిందలేమీ వుండవనీ వాళ్లవద్దే సేఫ్టీ యెక్కువ'' అని నచ్చచెప్పి దూరతీరాలకు వెళ్లిపోతే, నిందలు నిష్ఠూరాలు అపనిందలూ నీ

వారు పడుతున్నారని తెలియగానే కాక తాకి, ''నువ్వు వెళ్ళి, వేరే వుండు'' అని ఫాక్సు మెసేజి పంపితే అది స్థిరచిత్తమనాలా? అభినవ శ్రీరాముడనాలా? సంఘవిరుద్ధంగా లైఫ్ లీడ్ చేయమనీ, సంఘాన్నెదిరించాలనీ తలకెక్కించి యేకాకిని చేయాలని చూడలేదా? నా క్లయంట్ నిస్సహాయురాలు గాదా? సమాజం గౌరవిస్తుందా? ఆదుకుంటుందా?'' అని సవాళ్లు విసిరాడు.

ప్రతివాది చూస్తున్నాడని, ఓడిపోరాదని, రెండవ న్యాయవాది విలాసంగా పచార్లు చేస్తూ, నల్లకోటు పట్టుకుంటూ మధ్యమధ్య పెన్సిల్‌తో చూపుతూ యాక్షన్ చూపాడు.

''డబ్బు లేకపోయినా, స్టేటస్ లేకపోయినా, స్తోమత లేకపోయినా నోరున్నదని ప్రూవ్ చేయటం కల్చరా? పడినవాడు చెడడని వినలేదా? నా క్లయంట్ సలహాయిచ్చాడుగా''పడివుండమనీ నోరుగలవానిది రాజ్యం అని, నిందలు వేసి, అబద్ధాలాడి, యాగీ చేసి నాటకమాడితే తెరవెనక భాగవతం తేటతెల్లమౌతుంది. తవ్వి చూస్తే, అందించేది చాలక యింకాలాగాలని చేసిన ప్రయత్నమది అని. డబ్బు వెంట పరుగెత్తే వారూ, బ్లాక్ మెయిల్ చేసేవారూ చేసేదదే. నీ క్లయింట్ ఆ నాటకానికి తెరదింపలేకపోయిందేం?'' ఛాలెంజ్ చేసినట్లు చూచాడు.

కోర్టువారు వీడియో ఫిల్మ్ చూస్తున్నట్టుండిపోయారు.

'' ఆహాహా! సంస్కారం నూతన అభిరుచులు చౌరవా, ఔదార్యం మమతారహిత అభ్యుదయ భావాలు గల నీ క్లయంటునే ఆపలేక పయింది నా క్లయంట్. అంతా ఆమెకన్న పెద్దవారే. రాబోయే ప్రమాదం చెపితే బధిరుడల్లే చూశాడు. సత్యయుగం వచ్చేస్తున్నదన్నాడు. కింగ్‌డమ్ ఆఫ్ హెవెన్‌కి యిదే మార్గమన్నాడు. ఆ చెంపకొడితే యీ చెంప చూపాలిట. తనను ద్వేషించి అసహ్యించుకున్న వారికి వండి వడ్డించి, కాళ్లు గడిగి నెత్తిన చల్లుకుని బ్రహ్మరథం పడదాం రా అని రెక్క పట్టుకు లాగాడు నీ క్లయంట్. అదొకరకం మోడరేట్ మనిషి నీ క్లయంట్. అదొక రకం జ్ఞాన సమాజ సభ్యుడు నీ క్లయంటు.

సంఘాన్నెదిరించి పోరాడాలని స్లోగన్స్ నేర్పి, తీరా తన సమాజం చూసి తోక ముడిచాడు. ఆ సమాజ సభ్యులంతా దయా ధర్మమూ తెలిసినవారేగదూ శీల సంపద కాపాడుకోవాలని కట్టుదిట్టం చేసి'', అంటున్నాడు. ప్రతివాది ''యెన్ని చేసినా మీ క్లయింట్ ఖర్మానికి క్లయింట్‌ను వదిలేయలేదు గమనించాలి. మీ క్లయింటునూ, ఆమె పిల్లలను తెచ్చి దగ్గరపెట్టుకున్నాను. సంఘాన్నెదిరించినట్టే. యేలోటూ లేకుండా చూశాను'' అని దీర్ఘం తీస్తూ అన్నాడు.

''అది యెదిరింపటమెట్లా అయిందీ? నా క్లయింటును వూరికే యెందుకు సపోర్ట్ చేయాలని, యెన్ని విధాలుగా వాడుకోవచ్చన్నట్లు అర్థం వచ్చింది. యెలాగంటే యింట్లో రోగిష్టివారినీ, పరాయి వారినీ వుంచి, వారి పచ్చిపానాదులు చూడమని పురమాయించి, యెవరినో వుద్ధరించాలని ఒంటెలాగా యెలా వెళ్లావూ? నిందలూ నిష్ఠూరాలు పడిందా లేదా?''

''హియర్! హియర్! న్యాయస్థానంలో, వాదించి నేరనిరూపణ చేయాలంతే. వ్యక్తిదూషణ వేళాకోళం చేయరాదు'' అన్నాడు న్యాయాధిపతి. సుత్తెతో కొట్టి చప్పుడు చేశాడు. ప్రతివాది తరపున వకాలత్ ఐచ్ఛికంగా తీసుకున్న న్యాయవాది నవ్వుతూ యిటూ అటూ పచార్లు చేస్తూ అన్నాడు.

''అసలు యీ న్యాయవాది, న్యాయ నిరూపణలో సమర్థుడా అన్యాయ నిరూపణలో సమర్థుడా తెలుసుకోవాలి యువరానర్''.

''అన్యాయమే నిరూపిస్తున్నాను. బాచిలర్‌నని అనటంలో వుద్దేశమేమిటీ? మరొకరి మీదికి తప్పునెట్టటమేమిటీ? యేదో తప్పించుకోవాలని ట్రై చేస్తున్నట్లు తేలింది. తన వారేమన్నారుటా?'' తామెట్టి తతంగానికి అడ్డు చెప్పలేదనీ, బంగారమంటి మనస్సుగలవారమనీ ఢంకా బజాయిస్తే, లోగుట్టు పెరుమాళ్లు కెరుక అన్నట్టు, తానే తతంగం యెగ్గొట్టే పథకం వేశాడనీ, దేనికో వెరిచాడనీ, అదేమిటో బైటికి రావాలనీ, తెలుసుకోవాలనే నాశ్రమ. హరిశ్చంద్రుడు అసత్యం పల్కటానికి వెరిస్తే, నీ క్లయింట్ సత్యం పల్కటానికి వెరిచినట్టున్నాడు. అందుకే

స్వల్ప విషయాల దగ్గర్నుంచీ పెద్ద విషయాలను గూడా మసిబూసి మారేడుకాయ జేశాడు'' అని గట్టిగా అరిచాడు.

''యేకాయ చేసినా హాని చేయలేదు గదండీ?'' అని నవ్వాడు ప్రతివాది.

''అది చేయాలనే నీ విశ్వ ప్రయత్నం. అంతర్యుద్ధం అందుకే వచ్చింది. కోల్డ్‌వార్ నడిచిందందుకే'' అంటున్నాడు.

''పక్షపాతం యేదీ? వాళ్లవాళ్లనూ గౌరవంగా చూసి ఆదుకున్నానే. హింస యెక్కడ?'' అని గెలిచినట్టు చూశాడు.

''నా క్లయంట్ అనారోగ్యం పాలైతే, నీ వారిని తెచ్చి సేవ చేయించావా? పచ్చిం వండమన్నావా? లేదు. గుండె యేదీ? అదొకరకమైన పౌరుషమని పేరు పెట్టావు''.

''కాదు. దయగా చూడరేమో, దెప్పుతారేమో, ''యిప్పుడు గుర్తొచ్చామా, వస్తూ వస్తూ యేం తెచ్చావు? కాళ్లూ చేతులేనా?'' అని గేలిచేస్తే నొచ్చుకుంటుంది జబ్బు మనిషి అని చూశానండి'' అన్నాడు నవ్వు మొహంతోనే.

''చూశావా? నిజం బైటికి వస్తున్నది. మరి, నీవారి ఆపదలో నా క్లయంట్ వెళ్లి సేవజేసి, వండి వార్చి ఒదిగి వుండి, వారిచ్చిందేదో పుచ్చుకోవాలని వత్తిడి తేవటం హింసగాదా? హేవ్ యూ నో సెన్స్? వై డిడ్ యు హర్ట్ మై క్లయంట్స్ ఫీలింగ్స్? ఆర్ యూ నాటె మాన్?'' అని వురిమాడు న్యాయవాది.

''అఫ్‌కోర్స్. ఐ యామె మాన్. సంతాన మిచ్చాగా? కాదనగలరా? మరొకరికి కలిగారా?'' అని పకాపక నవ్వాడు ప్రతివాది.

''నీవే వెంట తోడు వెళ్లచ్చు లేదా డబ్బు చేతబెట్టి తోడు యిచ్చి పంపచ్చునే. ఇపుడేగా పురుషుడినే అన్నావు. ఒంటరిగా పొమ్మనటంలో ఐడియా యేమిటి'' నీ మంచెక్కడికి పోతుందని తీపి పలుకులెందుకు? అదే మారేడు కాయ. రిక్త హస్తాలతో ఒంటరిగా వెళ్తే గౌరవిస్తారా? అలుసుగాదా? అధికారమిచ్చారా?

బహుశా నీ వంతు ఆస్తి నా క్లయంట్‌కు లా ప్రకారం చెందకుండా వుండే పద్ధతి కనిబెట్టి వుండాలి. బీరాలు పలికి వుండాలి. మాట పట్టింపులొచ్చి భీష్మ ప్రతిజ్ఞ చేసి వుండాలి. అవన్నీ బైట పెట్టగలను. ''కవి గాంచనిచో రవి గాంచునే'' అన్నాడొక గొప్ప కవి. సూర్యుడు పోలేని చోటుకి గూడా కవి పోగలడు అంత వూహా శక్తి వుంటుంది కవికి. సూర్యునికి కవి అనిగూడా పేరున్నది. తండ్రి ఆస్తి తీసుకోను. ముట్టుకోను. పెళ్లాడను అని ప్రతిజ్ఞ చేశావేమో కాని స్త్రీని తెచ్చుకోను అనలేదు గదా అని ఆలోచించి, యాక్సిడెంటల్‌గా స్త్రీ అందితే, దాని దోవన అది వుంటుంది అని మనస్సును సమాధాన పరచి వుండాలి'' అన్నాడు.

''బాగా వూహించారు. అదే జరిగింది. మీరు న్యాయవాదే గాక కవిగూడానేమో'' అన్నాడు ప్రతివాది. నొచ్చుకున్నట్టే లేడు.

కోర్టు వారంతా కరతాళ ధ్వనులు చేసి హర్షం వెలిబుచ్చారు.

న్యాయాధిపతి నవ్వుతూ లేచాడు. కోర్టు మూసే వేళైంది.

వాది నిట్టూర్చి లేచి అందరితో గలిసి కోర్టు వదిలింది.

కథా నిలయం
5451
శ్రీకాకుళం